
సాక్షి
పల్నాడు
మంగళవారం । 18 । ఫిబ్రవరి । 2025



యార్డుకు 1,63,393 బస్తాల మిర్చి


కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,63,393 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,43,296 బస్తాలు అమ్మకాలు జరిగాయి.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 537.80 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు పదివేల క్యూసెక్కులు విడుదలవుతోంది.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



తెనాలి టౌన్: కొలకలూరులోని పంచముఖ గాయత్రీదేవి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం చండీ హోమం, శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

న్యూస్‌రీల్

జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై సమీక్ష



నరసరావుపేటటౌన్: మార్చి 8న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి సోమవారం స్థానిక న్యాయస్థాన భవనాల ఆవరణలో పోలీసు అధికారులతో న్యాయమూర్తులు సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మార్చి 8న స్థానిక న్యాయస్థానం భవనాలు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు స్థానిక అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.మధుస్వామి తెలిపారు. ఈ సందర్భంగా అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీసు అధికారులకు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవడానికి చట్టపరమైన అంశాలను వివరించారు. పోలీసులు కేసులు పరిష్కారానికి సంబంధించి లేవనెత్తిన పలు సందేహాలను నివృత్తి చేశారు. న్యాయమూర్తి ఆర్.ఆశీర్వాదం పాల్, వన్‌టౌన్ ఎస్ఐ అరుణ, టూటౌన్ ఎస్ఐ లేఖ ప్రియాంక, రొంపిచర్ల ఎస్ఐ మణి కృష్ణ , నకరికల్లు ఎస్ఐ సిహెచ్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు

ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షలు విరాళం




నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన వల్లభనేని సాయిప్రసాద్‌రెడ్డి, సరోజిని దంపతులు రూ.5,01,116లు విరాళంగా అందజేశారు. ఆలయంలో సోమవారం ఈఓ ఎన్.మాధవిలతను కలిసి దాతలు విరాళం చెక్కును అందించారు. తమ తల్లిదండ్రులు కబీర్‌దాస్, రాజమ్మ జ్ఞాపకార్థం విరాళాన్ని అందజేసినట్టు దాతలు తెలిపారు. ఆలయ పునర్నిర్మాణానికి దాతలు సహకరించాలని ఈఓ కోరారు. కార్యక్రమంలో నంద్యాల దామోదరరెడ్డి, సుబ్రహ్మణ్యం, శేఖర్ పాల్గొన్నారు.

రైతు బజార్లలో కూరగాయల రైతులకు అవకాశం

నరసరావుపేట: కూరగాయలు పండించే రైతులు వారి ఉత్పత్తులను రైతుబజార్లలో విక్రయించుకునేందుకు అవకాశం కల్పిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందిపడే రైతులు మండల ఉద్యానవనశాఖ, మార్కెట్ కమిటీ కార్యదర్శులను సంప్రదించాలని కోరారు. వారు జిల్లా అగ్రిట్రేడ్, మార్కెటింగ్ అధికారికి వివరాలు తెలియచేసి రైతు బజార్లలో విక్రయించుకునే అవకాశం కల్పిస్తారన్నారు. ఇతర వివరాలకు 91823 61451 నంబరులో సంప్రదించాలని కోరారు.

త్రికోటేశ్వరునికి బంగారు రుద్రాక్షలు బహూకరణ



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారికి నాదెండ్ల మండలం కమ్మవారిపాలెంకు చెందిన భక్తుడు చంద్ర శ్రీనివాసరావు రూ.16లక్షల విలువైన బంగారు రుద్రాక్షలను బహూకరించాడు. ఆలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా బంగారు రుద్రాక్షలను ఆలయ అర్చకులకు అందజేశారు. ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు.

ఏర్పాట్లు త్వరితగతిన పూర్తిచేయాలి

తిరునాళ్ల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారిని సోమవారం ఎమ్మెల్యేలు పత్తిపాటి పుల్లారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి ఆయన దర్శించుకున్నారు. అనంతరం తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలించారు. తిరునాళ్లకు తక్కువ సమయం ఉన్న దృష్ట్యా పనులు వేగవంతం చేసి పూర్తిచేయాలని సూచించారు. మహాశివరాత్రి రోజున కోటప్పకొండకు వచ్చే యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు.

వెలుగులో చీకట్లు!

- స్త్రీ నిధి రికవరీ బకాయిలు సుమారు రూ.13.50 కోట్లు
- అమరావతి, అచ్చంపేట, ఈపూరు మండలాల్లో రూ.3కోట్లు పక్కదారి
- అవినీతికి పాల్పడిన ఉద్యోగులకే ఉన్నతాధికారుల ప్రోత్సాహం!
- జీతం లేని వీఓ పోస్ట్‌కీ డిమాండ్
- పూర్తిస్థాయి విచారణ జరపాలని మహిళల డిమాండ్

మహిళల ఆర్థిక సాధికారత కోసం ఉద్దేశించిన వెలుగు పథకం అవినీతితో అంధకారమయంగా మారుతోంది. మూడు మండలాల్లో రూ.కోట్లు పక్కదారి పట్టడం అధికారుల అవినీతిని తేటతెల్లం చేస్తోంది. బినామీ పేర్లతో రుణాలు.. సరిగా చెల్లింపులు చేయకపోయినా రుణ మంజూరు.. రికవరీని పట్టించుకోకపోవడం.. బదిలీ అయిన సీసీలు రికార్డులు అప్పగించకుండానే వేరే విధుల్లోకి చేరిపోవడం, వారిపై చర్యలకు తాత్సారం చేయడం తదితర కారణాలతో వెలుగు పథకం లక్ష్యం నీరుగారుతోంది.



మహిళలు (ఫైల్)

అమరావతి: మహిళల ఆర్థిక సాధికారత కోసం సుమారు 25 ఏళ్ల క్రితం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రారంభించిన వెలుగు పథకం నేడు కొంతమంది ఉద్యోగుల నిర్వాకం, అవినీతి వల్ల మహిళల జీవితాల్లో వెలుగులు నింపకపోగా చీకటిని మిగిల్చుతోంది. పల్నాడు జిల్లాలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న వెలుగు సంస్థలో 36,500 మహిళా గ్రూపులు ఉన్నాయి. వీటిలో సుమారుగా 3,65,500 మంది ఆర్థిక లావాదేవీలు చేస్తుంటారు.

వీఓలు, సీసీలే కీలకం..

వెలుగు సంస్థలో మహిళా గ్రూపుల నిర్వహణలో గ్రామ సమైక్య సంఘాలు, వాటిని అన్ని విధాలుగా నడిపించే సీసీలు కీలక పాత్ర పోషిస్తారు. కొందరు సీసీలు, గ్రామ సమైక్య సంఘాల లీడర్లు (వీఓ) ఇష్టారాజ్యంగా విధివిధానాలు అతిక్రమించి చెల్లింపులు సక్రమంగా లేకపోయినా మళ్లీ రుణాలు మంజూరు చేయడం, అలాగే స్త్రీనిధి, ఇతర పథకాల వాయిదాల చెల్లింపులలో అవకతవకలు పాల్పడ్డారనే విమర్శలు వినవస్తున్నాయి. దీంతో వెలుగు పథకంలో గత రెండేళ్లుగా బ్యాంకుల నుంచి ఇచ్చే రుణాలు తప్ప మదే ఇతర పథకాల నుంచి వచ్చే రుణాలను దాదాపుగా నిలిపివేశారు. వెలుగు పథకంలో బదిలీ అయిన సీసీలు రికార్డులు అప్పగించకుండానే మరొక విధుల్లో చేరిపోవటంతో సమస్య జఠిలమవుతోంది. అసలు ఎటువంటి వేతనాలు, గౌరవ వేతనాలు లేని వీఓ అధ్యక్ష, కార్యదర్శుల పదవులకు డిమాండ్ ఏర్పడిన పరిస్థితి. కొంతమంది యానిమేటర్‌లు, సీసీలు కొన్ని గ్రామ సమైఖ్య సంఘాలకు నామమాత్రంగా అధ్యక్ష, కార్యదర్శులను నియమించి చక్రం తిప్పి అనినీతి పాల్పడున్నారన్నానే ఆరోపణలు మెండుగా ఉన్నాయి.

సమగ్ర విచారణ జరపాలి



రూపాయి, రూపాయి కూడబెట్టుకుని ఆర్థికంగా ఎదుగుదామని డ్వాక్రా గ్రూపుల్లో చేరితే ఇక్కడా మహిళలకు అన్యాయమే జరుగుతుంది. జిల్లాలో గ్రామీణాభివృద్ధి పథకం ద్వారా నిర్వహించే వెలుగు సంస్థలో కొన్ని మండలాల్లో అవినీతి జరిగింది. మిగిలిన మండలాల్లో కూడా లావాదేవీలు ఎలా ఉన్నాయో తెలియని పరిస్థితి. జిల్లాలోని అన్ని మండలాల్లో ఉన్నతాధికారుల బృందంతో సమగ్ర విచారణ జరిపాలి. అలాగే వీలైనంత వరకు వెలుగు సంస్థలో మహిళా ఉద్యోగులను నియమించాలి

– కె.హనుమంతరెడ్డి, సీఐటీయూ పల్నాడు జిల్లా అధ్యక్షుడు

'స్త్రీ నిధి'.. పక్కదారి

వెలుగు ప్రాజెక్టు ద్వారా ప్రధానంగా ఏడు పథకాల నుంచి మహిళలకు రుణాలు మంజూరు చేస్తారు. ఇందులో స్త్రీనిధి పథకం, గ్రామ సమైఖ్య సంఘాలకు ఇచ్చే కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్, హ్యూమన్ డెవలప్‌మెంట్ ఫండ్, విలేజ్ రివాల్వింగ్ ఫండ్, పూరెస్ట్ ఆఫ్ ది పూర్ పథకం, అలాగే ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఉన్నతి పథకం, రైతు కుటుంబాలకు రుణాలు ఇచ్చే ఫార్మర్ ప్రొడక్షన్ ఆర్గనైజేషన్‌ల ద్వారా మహిళలు, రైతులు రుణాలు పొంది సబ్సిడీలు పోనూ మిగిలిన నగదు తిరిగి చెల్లించాల్సి ఉంది. గత రెండేళ్లుగా వెలుగు కార్యకలాపాల్లో ఎటువంటి రాజకీయ జోక్యం లేకపోయినా పూర్తిస్థాయిలో అవినీతి పెరిగిపోయింది. ఒక్క స్త్రీ నిధి పథకంలోనే ప్రధానంగా అమరావతి, అచ్చంపేట, ఈపూరు మండలాల్లో సుమారు రూ.3కోట్లు నిధులు పక్కదారి పట్టి లెక్కలు తేలటం లేదంటే అవినీతి ఏ మేరకు జరిగిందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలోని 25 మండలాల్లో రూ.13.5 కోట్ల రుణ బకాయిలు ఉన్నాయంటే రికవరీ గురించి వెలుగు అధికారులు మర్చిపోయారనే చెప్పుకోవచ్చు.



పథకాలలో నిధుల మళ్లింపు

జిల్లాలో స్త్రీనిధి పథకంలో అమరావతి, అచ్చంపేట, ఈపూరు మండలాలలో పలువురు వీఓలపై విచారణ చేసి నిధుల మళ్లింపు, అవినీతి జరిగినట్లు నిర్ధారించారు. ఇప్పటికి అందుబాటులో ఉన్న రికార్డుల ద్వారా విచారణ జరపగా అమరావతిలో సుమారుగా రూ.77లక్షలు, అచ్చంపేటలో రూ.45లక్షలు అవినీతి బయటపడటంలో అధికారులు అచ్చంపేటలో ఒక సీసీని సస్పెండ్ చేశారు. ఇందులో భాగంగానే డీఆర్‌డీఏ పీడీని సరెండర్ చేయటం జరిగింది. వెలుగు సంస్థలో జరిగిన అవినీతి, నిధుల మళ్లింపులపై ఉన్నతస్థాయి అధికారుల కమిటీ వేసి జిల్లాలోని అన్ని మండలాల్లో పూర్తిస్థాయి విచారణ జరిపి, ప్రక్షాళన చేయాలని మహిళలు కోరుతున్నారు.

వైస్ చైర్మన్ ఎన్నిక ముగిసింది

గురజాల ఆర్డీఓ మురళీ కృష్ణ



మాట్లాడుతున్న ఆర్డీఓ మురళీ కృష్ణ



నియామక పత్రంతో వైస్ చైర్మన్ ఉన్నం భారతి

పిడుగురాళ్ల: పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక సోమవారం ముగిసిందని గురజాల ఆర్డీఓ, ఎన్నికల అధికారి మురళీ కృష్ణ తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. అనారోగ్యంతో మున్సిపల్ వైస్ చైర్మన్ మృతి చెందటంతో ఖాళీ అయిన స్థానానికి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్నిక నిర్వహించటం జరిగిందన్నారు. ఈ ఎన్నికకు 30వ వార్డు కౌన్సిలర్ ఉన్నం భారతిని కోరం సభ్యులందరు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. ఉన్నం భారతిని వైస్ చైర్మన్‌గా 28వ వార్డు కౌన్సిలర్ గర్నె నాగేశ్వరరావు ప్రతిపాదించగా, 20వ వార్డు కౌన్సిలర్ కొత్త తులసీ సౌజన్య బలపరచటం జరిగిందన్నారు. హాజరైన కౌన్సిలర్లందరూ ఏకగ్రీవంగా ఆమోదించటంతో ఎన్నిక సజావుగా జరిగిందన్నారు. ఉన్నం భారతికి నియామక పత్రాలను అందజేశామన్నారు. మొత్తం 33 మందికి గాను కోరంకు సరిపడా 17 మంది కౌన్సిల్ సభ్యులు హాజరయ్యారన్నారు. కోరం పూర్తి అయిన తర్వాత ఈ ఎన్నికను నిర్వహించటం జరిగిందన్నారు. ఈ ఎన్నికకు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే ధనుంజయ్ అబ్జర్వర్‌గా వ్యవహరించారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

తిరునాళ్లను విజయవంతం చేద్దాం

సమీక్షలో అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ



తిరునాళ్లపై అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి కోటప్పకొండ తిరునాళ్లను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావులు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో కోటప్పకొండ తిరునాళ్లపై జిల్లా అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్అండ్‌బీ అధికారి రాజానాయక్ మాట్లాడుతూ 21 నుంచి తిరునాళ్లలో బారికేడ్లు నిర్మిస్తామని, రహదారులు విస్తరణ, పెండింగ్ మరమ్మతులు వంటివి పూర్తి చేస్తామన్నారు. మరో మూడు రోజుల్లో అప్రోచ్ రోడ్డు నిర్మాణాలు, గ్రావెల్ ప్యాచ్ వర్కులు, జంగిల్ క్లియరెన్స్ పూర్తిచేస్తామని పంచాయతీరాజ్‌శాఖ అధికారులు తెలిపారు. డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రవి మాట్లాడుతూ కొండ దిగువ నుంచి పైవరకు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామని, 108 వాహనాలు, క్యూలైన్ల వద్ద, మెట్ల మార్గంలో, కొండపైన మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశామన్నారు. ట్రాన్స్‌పోర్ట్ అధికారులు, ఆర్టీసీ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు తమతమ పరిధిలో జరుగుతున్న పనులను వివరించారు. పౌరాణిక, సాంఘిక నాటకాలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. దేవదాయ శాఖ అధికారులు అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుని పనిచేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో తిరుణాళ్ల నిర్వహణకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉన్నతాధికారులు, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ కోటప్పకొండను సందర్శించి పనులను పరిశీలించారు.

20 నుంచి పాఠశాలల్లో 'స్ఫూర్తి'

నరసరావుపేట: పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులలో భయం పోగొట్టేందుకు జిల్లాలో ఈనెల 20 నుంచి 'స్ఫూర్తి' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నిపుణలతో ఆన్‌లైన్ విధానంలో విద్యార్థులను అనవసర ఒత్తిడికి గురికాకుండా తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలల్లోని విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని స్ఫూర్తి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా 'స్ఫూర్తి' పోస్టర్ విడుదల చేశారు. జిల్లాలోని బాలికల సంక్షేమ హాస్టళ్లలో మెరుగైన భద్రత కోసం 'రక్ష ' పేరుతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసే కార్యక్రమం చేపట్టామన్నారు. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల కోసం జిల్లాలో 90 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. శివరాత్రి మరుసటి రోజే ఎన్నికల పోలింగ్ ఉన్నందున నరసరావుపేటలో పోలింగ్ పూర్తయ్యే వరకూ ప్రభల తిరుగు ప్రయాణానికి ఆంక్షలుంటాయన్నారు. ప్రతి నెలా మూడో శనివారం గ్రామస్థాయిలో స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తామని, ప్రతి నెలా ఒక గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తానని చెప్పారు. వారంలో ఒక రోజు ఒక సంక్షేమ హాస్టల్‌లో బస చేస్తామని, ఉన్నతాధికారులు సైతం వారంలో ఒక రోజు హాస్టళ్లలో రాత్రిపూట బస చేయాల్సివుంటుందన్నారు. వేసవిలో నీటి ఎద్దడిని తగ్గించేందుకు పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయని పేర్కొన్నారు. జేసీ సూరజ్ ధనుంజయ్ గనోరే, డీఆర్ఓ ఎ.మురళి, డీఈఓ చంద్రకళ పాల్గొన్నారు.

అమ్మభాష ఆనందాలు

- నేటి నుంచి బడుల్లో భాషల సంబరాలు
- 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా నిర్వహణ
- 21వ తేదీ వరకు వివిధ అంశాల్లో పోటీలు



యడ్లపాడు: మాటలు, రాతలు, దైనందిన జీవితంలోని ప్రతి వ్యక్తీకరణలో తల్లిభాషకు ప్రాధాన్యం ఇవ్వాలని చాటి చెప్పేదే మాతృభాషా దినోత్సవం. ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ మాతృభాషను మననం చేసుకునే శుభతరుణం. జాతి మనుగడకు భాషే ప్రధానమని స్మరించుకునే రోజు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు వీటిని నిర్వహించుకునేందుకు సిద్ధమయ్యాయి.

నాలుగు రోజుల పాటు సంబరాలు

భాష అనేది కేవలం కమ్యూనికేషన్ సాధనం మాత్రమే కాదు, అది ఒక సంస్కృతిని, విలువలను, జీవన విధానాన్ని ప్రతిబింబించే గొప్ప వారసత్వం . ఈ నేపథ్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యాసంస్థలు భాషా సంబరాలకు సన్నద్ధమవుతున్నాయి. ఈ నెల 18వ తేదీ నుంచి 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. భాషా అభివృద్ధికి, విద్యార్థుల్లో నైపుణ్యాల వికాసానికి తోడ్పడేలా ప్రభుత్వ బడులు, కళాశాలలు సన్నద్ధమవుతున్నాయి.

పోటీల నిర్వహణ ఇలా..

ఈ సంబరాల్లో కథలు చెప్పటం, రచన, చర్చలు, వక్తృత్వం, పాత్రపోషణ, బోధనోపకరణాల తయారీ వంటి పోటీలు నిర్వహించనున్నారు. సంస్కృతంలో చిన్నకథలు రాయడం, శ్లోకాలు, పద్యాలు, ఉర్దూ, మైనార్టీ విద్యార్థుల కోసం ప్రాసలు, గజల్స్ చెప్పే అవకాశం ఉంది. గిరిజన భాషలు సంస్కృతి ప్రతిబింబించేలా సంప్రదాయ నృత్యాలు, పాటలు, ఆటలు కూడా చోటు చేసుకోనున్నాయి. ఈనెల 18వ తేదీన ఆంగ్లం, 19న సంస్కృతం, హిందీ, ఉర్దూ, 20న గిరిజన భాషలు, కన్నడం, తమిళం, ఒరియా 21న తెలుగు భాషకు సంబంధించి పోటీలు నిర్వహించనున్నారు. పోటీల నిర్వహణకు పాఠశాలకు రూ. 500 కేటాయించినట్లు వెల్లడించారు.

సృజనాత్మకతకు చోటు..

భాషా సంబరాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, భాషపట్ల ప్రేమను పెంపొందించడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశం. లుప్తమవుతున్న భాషల ప్రాముఖ్యతను తెలియజేయడమే ఈ సంబరాల ప్రత్యేకత. ప్రతి పాఠశాలలో వీటి నిర్వహణకు హెచ్ఎంలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

– ఎల్ చంద్రకళ, జిల్లా విద్యాశాఖ అధికారి, పల్నాడు

దూసుకొచ్చిన మృత్యువు

కూలీల ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- నారాకోడూరు వద్ద ప్రమాదంలో ముగ్గురు మహిళలు మృతి
- తొమ్మిది మందికి గాయాలు
- ప్రమాదానికి పొగ మంచే కారణం



ప్రమాదంలో నుజ్జునుజ్జుగా మారి బోల్తా పడిన ఆటో



ప్రమాదానికి కారణమైన బస్సు

చేబ్రోలు: మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన 12 మంది వ్యవసాయ కూలీలు సోమవారం వేకువజామునే నీరుకొండ ప్రాంతానికి మినుము కోత పనులకు ఆటోలో పయనమయ్యారు. దారంతా దట్టమైన పొగ మంచు కమ్మింది. నారాకోడూరు – బుడంపాడు గ్రామాల మధ్యకు వచ్చేసరికి గుంటూరు– 2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కూలీల ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అల్లంశెట్టి అరుణకుమారి (39), కుర్రా నాంచారమ్మ (40), తోట సీతారావమ్మ (41) అక్కడికక్కడే మరణించారు. వీరితోపాటు ఎం.శివమ్మ, ఎం. శివపార్వతి, జి. మల్లేశ్వరి, ఏ.వెంకట ప్రవీణ, ఆర్. రత్నకుమారిలతో పాటు ఆటో డ్రైవర్ ఇబ్రహీంతో పాటు మరో ముగ్గురుకు గాయాలయ్యాయి. వీరంతా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. మృతి చెందిన ముగ్గురు మహిళల మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు.

ప్రమాదంలో మృతి చెందిన మహిళలు



రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలు

ప్రమాదంలో మరణించిన ముగ్గురు కుటుంబాలది రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. సుద్దపల్లి గ్రామంలోని యూపీ స్కూల్ సమీపంలో నివసిస్తున్న వీరంతా ఊరిలో వ్యవసాయ పనులు లేకపోవడంతో సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న నీరుకొండ పరిసర ప్రాంతాలకు కొద్ది రోజులుగా వెళుతున్నారు. రోజు మాదిరిగానే సోమవారం తెల్లవారుజామున ఆటోలో 12 మంది మహిళలు పనులకు బయలుదేరారు. పనులకు వెళ్లొస్తామంటూ చిరునవ్వుతో ఇంట్లోంచి బయలుదేరి వెళ్లిన వీరంతా కొద్దిసేపటికి ప్రమాద ఘటనా స్థలంలో మిగతా జీవులుగా మారడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.

భయానక వాతావరణం

ప్రమాద సంఘటనలో ఆటో నుజ్జునుజ్జుగా మారి బోల్తా పడింది. ఆర్టీసీ బస్సు ముందు భాగం దెబ్బతింది. ప్రమాద స్థలంలో భయానక వాతావరణం నెలకొంది. ప్రమాదంతో పొన్నూరు, గుంటూరు రోడ్డుకు ఇరువైపులా కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. చేబ్రోలు పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని క్రమబద్ధీకరించారు. పొన్నూరు రూరల్ సీఐ వై. కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ డి. వెంకటకృష్ణ సంఘటన ప్రాంతానికి చేరుకొని ప్రమాద వివరాలను నమోదు చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అదిగో జాగా.. వేసేయ్ పాగా

రూ.2 కోట్లు విలువైన భూమి కబ్జా

- అల్లూరివారిపాలెంలో టీడీపీ నాయకుల ఆక్రమణ
- కాలనీ అవసరాల కోసం కేటాయించిన భూమిలో నిర్మాణాలు

నరసరావుపేట రూరల్: భూముల ధరలు పెరిగిపోవడంతో చిన్న జాగా కనిపించినా పచ్చనేతలు వదిలిపెట్టడం లేదు. కలెక్టరేట్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని యథేచ్ఛగా ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడుతున్నారు. దాదాపు రూ.2.కోట్ల విలువైన స్థలాన్ని కబ్జాచేసి ఇళ్ల నిర్మిస్తున్నా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తైనా చూడటం లేదు.

భూముల ధరలు పెరగడంతో..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నరసరావుపేటను జిల్లా కేంద్రంగా చేయడంతో భూములు ధరలు అమాంతం పెరిగిపోయాయి. రియల్ ఎస్టేట్ వెంచర్లు పట్టణానికి సమీపంలోని గ్రామాల వరకు వేశారు. ఫలితంగా పట్టణానికి చుట్టుపక్కల గ్రామాల్లోనూ సెంటు భూమి రూ.5లక్షలకుపైగా పలుకుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత విలువైన ప్రభుత్వ భూములపై టీడీపీ నేతలు కన్ను పడింది. ఆయా స్థలాలను దర్జాగా ఆక్రమించుకొని ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు.



ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్న దృశ్యం

అల్లూరివారిపాలెం ఎస్టీ కాలనీలో

అల్లూరివారిపాలెం గ్రామంలో నాలుగు దశాబ్దాల క్రితం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కాలనీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కాలనీల ఏర్పాటు సమయంలో మౌలిక సదుపాయాల కల్పనకు 10 శాతం భూమిని కేటాయించారు. ఎస్టీ కాలనీకి ఈ విధంగా కేటాయించిన భూమి 30 సెంట్ల వరకు ఉంది. ఈ భూమి ఖాళీగా ఉండటంతో స్థానికులు వివిధ అవసరాల కోసం వినియోగించేవారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ భూమిపై స్థానిక టీడీపీ నాయకుల కన్నుపడింది. గ్రామ మాజీ సర్పంచ్‌తోపాటు మరికొందరు కలసి ఈ భూమిని ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు.

భూమి విలువ రూ.2కోట్లు పైమాటే!

కలెక్టర్ కార్యాలయం నుంచి 2 కిలోమీటర్ల దూరంలోనే అల్లూరివారిపాలెం ఎస్టీ కాలనీ ఉంది. లింగంగుంట్ల కాలనీ నుంచి అల్లూరివారిపాలెంలోని ఎస్టీ కాలనీ వరకు రియల్ ఎస్టేట్ వెంచర్లు వేశారు. దీంతో ఈ భూములకు విలువ వచ్చింది. ఇక్కడ సెంటు రూ.7లక్షల వరకు పలుకుతోంది. ఆక్రమణకు గురైన భూమి దాదాపు 30 సెంట్లు ఉండటంతో దీని విలువ రూ.2కోట్లపైగా ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు.



ప్రభుత్వ స్థలంలో రేకులు వేసి ఆక్రమణ

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

కాలనీలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంపై సమాచారం లేదు. వీఆర్వోను పంపి వివరాలు సేకరించి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూమిని ఎవరు ఆక్రమించినా చట్టపరమైన చర్యలు ఉంటాయి.

– వేణుగోపాల్, తహసీల్దార్

కాజ టోల్ ప్లాజాను రద్దుచేయాలి



మంగళగిరి టౌన్: మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని అధిక టోల్‌ఫీజు వసూలు చేస్తున్న కాజ టోల్‌ప్లాజాను వెంటనే రద్దు చేయాలని ప్రయాణికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ బాల వెంకటరావు, ప్రధాన కార్యదర్శి నన్నపనేని నాగేశ్వరరావు కోరారు. మంగళగిరి నగర పరిధిలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాజ టోల్‌గేట్ వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు 79 కిలోమీటర్ల దూరంలో టోల్‌ప్లాజా ఉండకూడదని దీనిపై లారీ ఓనర్స్ మౌనం ఎందుకు వహిస్తున్నారని ప్రశ్నించారు. గతంలో రూ.150 ఉండే టోల్‌పాస్ ఇప్పుడు రూ.340 చేశారని దీనిపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. గుంటూరు, విజయవాడ మధ్యలో ఉన్న ఈ టోల్‌గేటును తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

ఐదు, ఇంటర్ తరగతుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అచ్చంపేట: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలురు గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ఐదు, ఇంటర్ ప్రథమ సంవత్సరం తరగతుల ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవలసినదిగా పాఠశాల/కళాశాల ప్రిన్సిపల్ అరుణకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తరగతులు ఇంగ్లిష్ మీడియంలో ఉంటాయని పేర్కొన్నారు. ఐదో తరగతికి 80 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపునకు 40 సీట్లు, బైపీసీ గ్రూపునకు 40సీట్లు ఉంటాయని వివరించారు. కుల రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు భర్తీ చేస్తామని, ఏప్రిల్ 6, 20025 తేదీలోపు http://apbragcet.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు పంపుకోవలసి ఉంటుందని వెల్లడించారు. పూర్తి వివరాలకు 9059660634 నంబరుకు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చని సూచించారు.


నీతి ఆయోగ్ బృందం తక్కెళ్లపాడు సందర్శన

పెదకాకాని: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల సద్వినియోగంపై నీతి అయోగ్ ప్రతినిధుల బృందం తక్కెళ్లపాడు పంచాయతీ కార్యాలయాన్ని సోమవారం సందర్శించింది. బృందం సభ్యులు జిష్యుపాల్, స్వప్నలు ప్రధానమంత్రి ఆవాస్ యోజన, సడక్ యోజన, పింఛన్ పంపిణీ, డ్వాక్రా యానిమేటర్లతో మాట్లాడారు. డ్వాక్రా స్వయం సహాయ సంఘాలకు మంజూరు చేసిన నిధుల సద్వినియోగంపై డ్వాక్రా సంఘాల మహిళలతో చర్చించారు. ఈ పథకాలను సంబంధించిన పలు రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ ప్రదర్శన ఇంద్రప్రస్థం



ఇంద్రప్రస్థంలోని దృశ్యం



అన్నదాత నాటికలోని దృశ్యం

నరసరావుపేట ఈస్ట్: నరసరావుపేట రంగస్థలి 45వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, రంగస్థలి సంయుక్త ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహించిన 24వ జాతీయస్థాయి ఆహ్వాన తెలుగు నాటిక పోటీలలో గుంటూరు అభినయ ఆర్ట్స్ వారి ఇంద్రప్రస్థం నాటిక ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. రెండవ ఉత్తమ ప్రదర్శన బహుమతి గుంటూరు అమరావతి ఆర్ట్స్ వారి చిగురు మేఘం నాటికకు లభించింది. ఉత్తమ నటుడుగా హైదరాబాద్ కళాంజలి వారి అన్నదాత నాటికలో అంకమ్మతాత పాత్రధారి చెంచు పున్నయ్య, ఉత్తమ నటిగా కాకినాడ జి.వి.కె.క్రియేషన్స్ వారి తితిక్ష నాటికలో భారతి పాత్రధారి ఎస్.జ్యోతిరాణి, ఉత్తమ విలన్‌గా వెలగలేరు ఆర్ట్స్ థియేటర్ వారి రాత నాటికలో అజయ్ పాత్రధారి పవన్‌కళ్యాణ్ ఎంపికయ్యారు. ఉత్తమ దర్శకుడు బహుమతి ఇంద్రప్రస్థం దర్శకుడు ఎస్.రవీంద్రరెడ్డి కైవసం చేసుకున్నారు. ఉత్తమ రచనగా రాత నాటిక రచయిత పోలదాసు శ్రీనివాసరావు బహుమతులు అందుకున్నారు. అలాగే క్యారెక్టర్ నటుడిగా చిగురు మేఘం నాటికలో చిన్నయ్య పాత్రధారి కావూరి సత్యనారాయణ, హాస్య నటునిగా పక్కింటి మొగుడు నాటికలో సీతాపతి పాత్రధారి యు.వి.శేషయ్య, ఉత్తమ బాలనటిగా రాత నాటికలో స్వప్నిక పాత్రధారి సురభి వాగ్దేవి, ఉత్తమ మేకప్ శ్రీఉమా ఆర్ట్ కాకినాడ (తితిక్ష), రంగాలంకరణ టి.బాబురావు (తితిక్ష), ఉత్తమ సంగీతం కె.వి.రమణ (పక్కింటి మొగుడు), ప్రత్యేక జ్యూరీ బహుమతి రాత నాటిక బహుమతులు సాధించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా నూసుము నాగభూషణం, మానపురం సత్యనారాయణ, షేక్.బాజీ వ్యవహరించారు. కాగా, ఈ ఏడాది రంగస్థలి ప్రతిభా పురస్కారాన్ని నాటక రచయిత, నటుడు, దర్శకుడు చలసాని కృష్ణప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమాలను రంగస్థలి అధ్యక్షుడు షేక్‌మహబూబ్‌సుభానీ, గౌరవాధ్యక్షుడు కిలారు వెంకటరావు, ప్రధాన కార్యదర్శి నల్లపాటి రామచంద్రబోస్, కోశాధికారి కనపర్తి సూరిబాబు, ఏ.ఏ.మధుకుమార్. పి.శ్రీనివాసాచార్యులు తదితరులు పర్యవేక్షించారు.

మహాశివరాత్రి తిరునాళ్లకు ముస్తాబు

అమర్తలూరు (వేమూరు): మహాశివరాత్రి తిరునాళ్ల బాల కోటేశ్వర స్వామి దేవస్థానం ముస్తాబు అవుతోంది. ఈ తిరునాళ్లకు భక్తజనం పెద్ద సంఖ్యలో తరలివస్తారు. దీంతో వారి దర్శనానికి సంబంధించిన ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు, దేవస్థానం కార్య నిర్వహణాధికారి అశోక్ కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా దేవస్థానానికి రంగులు వేస్తున్నారు. భక్తులు దేవుని దర్శనం కోసం క్యూలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన మహాశివరాత్రికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మరమ్మతులు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.



క్వారీ తిరునాళ్లకు సకల సౌకర్యాలు


తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా



సమావేశంలో మాట్లాడుతున్న తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా

చేబ్రోలు: మహారాత్రి సందర్భంగా క్వారీ తిరునాళ్లకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా ఆదేశించారు. వడ్లమూడి క్వారీ తిరునాళ్ల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ అధికారుల కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. భక్తుల అభిషేకాలు, దర్శనాలు, తాగునీటి వసతి, పారిశుద్ధ్య నిర్వహణ, ఎలక్ట్రికల్ ప్రభల బరువు, సామర్థ్యం, ఎత్తు, ట్రాఫిక్ నియంత్రణ, వెహికల్స్ పార్కింగ్ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ శ్రీ బాల కోటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అధికారులను శాఖల వారీగా విడిది స్టాల్స్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయ ఈఓ రామకోటేశ్వరరావు మాట్లాడుతూ మూడు రోజులు పాటు వైభవంగా మహాశివరాత్రి వేడుకలు జరుగుతాయని, ఈ వేడుకల్లో మొదటిరోజు పశువుల ప్రదక్షిణలు ఉంటాయని, రెండో రోజు వాహనాల ప్రదక్షిణలు పూజలు ఉంటాయని, మూడవరోజు ఈనెల 26వ భక్తుల అభిషేకాలు మహాశివరాత్రి వేడుకలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ కె.శ్రీనివాసశర్మ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.ఉమాదేవి, ఈఓపీఆర్డీ టి.ఉషారాణి, ఆలయ ఈఓ రామకోటేశ్వరరావు, తిరునాళ్ల కమిటీ చైర్మన్ జి.శ్రీకాంత్, 52 శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి శ్రావణ్ బాబు

తాడికొండ: చిన్నారులకు వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అందించే టీకాలు సకాలంలో వేయించేలా సిబ్బంది చొరవ తీసుకోవాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు అన్నారు. సోమవారం తుళ్లూరు పీహెచ్‌సీని సందర్శించిన ఆయన వైద్య బృందంతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్నారులకు బిడ్డ పుట్టిన దగ్గర నుంచి ఏఏ టీకాలు ఏ సమయంలో వేయించాలి అనే విషయంపై స్పష్టంగా అవగాహన కల్పించాలని కోరారు. టీకాలకు సంబంధించిన సమాచారాన్ని యు విన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసే విధానాన్ని వివరించారు. గ్రామాల్లో సీడీఎన్‌సీ సర్వే చేసి ప్రతి గ్రామంలోని కుటుంబాలకు ఐడీ నంబర్లు ఇచ్చేలా చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.శ్రీనివాస్, వసుంధర, శివపార్వతీ, సీహెచ్‌ఓ వెంకట రమణ, ఎంఎస్ రాణి, పర్యవేక్షకులు సుధాకర్, డీఎస్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ కరీమ్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో అంగన్‌వాడీలకు నిధులు కేటాయించాలి



సత్తెనపల్లి: బడ్జెట్‌లో అంగన్‌వాడీలకు నిధులు కేటాయించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి డిమాండ్ చేశారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో సోమవారం జరిగిన పల్నాడు జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. సమావేశానికి ఎస్.కె సుజాత అధ్యక్షత వహించారు. మల్లేశ్వరి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీల 42 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్ అహల్య, పద్మ, భవాని, సీఐటీయు మండల కార్యదర్శి పెండ్యాల మహేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అద్భుతమైనది హనుమత్ వైభవం



తెనాలి: హనుమత్ వైభవం చాలా గొప్పదని, వాస్తవానికి భవిష్యత్‌బ్రహ్మ ఆంజనేయస్వామిగా పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి(బాలస్వామి) అన్నారు. స్థానిక షరాఫ్‌బజారులోని శ్రీసువర్చలా సమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవాలయాన్ని బాలస్వామి సోమవారం దర్శించారు. స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. తన బాల్యంలో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంతో అనుబంధాన్ని గుర్తుచేశారు. అనంతరం భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. హనుమంతుడి ధ్వజం ఎక్కడైతే ఉంటుందో అక్కడ జయాలు ఉంటాయని చెప్పారు. హనుమాన్ చాలీసా కూడా జయహనుమతోనే ప్రారంభమవుతుందని గుర్తుచేశారు. మాఘమాసంతో సహా ఏ మాసంలో ఏరోజు ఏమేం చేయాలో? ధర్మ ఆచరణ విధివిధానాలను పెద్దలు చెప్పారనీ, ప్రజలు శాస్త్రప్రకారం ధర్మాన్ని పాటిస్తూ, భగవంతుడిని ఆరాధిస్తూ తమ జీవనవిధానాన్ని ఆచరించాలని సూచించారు. బాలస్వామీజీకి ఆలయ ఈఓ అవుతు శ్రీనివాసరెడ్డి, హరిప్రసాద్, ప్రధాన అర్చకుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, ఆర్‌వీ కిరణ్‌కుమార్ స్వాగతం పలికారు. స్వామీజీతో సాలిగ్రామ మఠం కార్యదర్శి రావూరి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



చీరాల రూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన సోమవారం చీరాల రైల్వే స్టేషన్ పైరాఫీసు గేటు సమీపంలోని వెంకటేశ్వర స్వామి గుడి ఎదురుగా చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య వివరాల మేరకు.. పైరాఫీసు గేటు సమీపంలో వ్యక్తి మృతి చెందాడనే సమాచారంతో ప్రమాద స్థలాన్ని పరిశీలించగా మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. మృతుడి వయస్సు సుమారు 30 ఏళ్లు ఉండవచ్చని, మృతదేహంపై బ్లాక్ కలర్ చొక్కా, గళ్ల లుంగీ ఉందని చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు జీఆర్పీ ఎస్సై 94406 27646 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై శిక్షణ



కలెక్టరేట్ శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

నరసరావుపేట: ఈనెల 27వ తేదిన శాసనమండలి ఎన్నికల పోలింగ్ ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి.అరుణ్‌బాబు చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని గుర్రం జాషువా సమావేశ మందిరంలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు పోలింగ్ నిర్వహణపై శిక్షణ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బ్యాలెట్ బాక్సుల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని అధికారులకు సూచించారు. మొత్తం 25 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని వివరించారు. మొత్తం 38 ప్రదేశాలలో 90 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 600 మంది పోలింగ్ సిబ్బందిని నియమించామని వివరించారు. కట్టుదిట్ట పోలీసు బందోబస్తు మధ్య పోలింగ్ జరుగుతుందని వెల్లడించారు. ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్‌గా నరసారావుపేటలోని ఎస్ఎస్ఎన్ కాలేజీని ఎంపిక చేసినట్టు వివరించారు. శిక్షణలో జిల్లా రెవెన్యూ అధికారి ఐ.మురళి, మాస్టర్ ట్రైనర్లు పూర్ణచంద్రరావు, అరుణ్, ఎంవీ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



సత్రశాలలో ఎస్ఐ నాగార్జునకు సూచనలు ఇస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

సత్రశాల(రెంటచింతల): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 26న సత్రశాల వద్ద వేంచేసిన గంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానానికి తరలివచ్చే వేలాదిమంది భక్తుల శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు ఎస్పీ కె.శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం ఆయన సత్రశాల దేవస్థానం వద్ద మహాశివరాత్రికి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. ఈఓ గాదె రామిరెడ్డితో ప్రత్యేకంగా మాట్లాడి సూచనలు చేశారు. ఎస్ఐ సీహెచ్ నాగార్జునతోనూ బందోబస్తు గురించి మాట్లాడారు. పలు సూచనలు చేసి మాట్లాడారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ ప్రభలను తక్కువ ఎత్తులో ఉండేలా ఏర్పాటు చేసుకోవాలని, ప్రభలపై అశ్లీల నృత్యాలు, ఇతరులను కించపరిచేలా, ఇబ్బంది పెట్టేలా పాటలు పాడితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముందుగా రెంటచింతల పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సందర్శించారు. ఎస్పీ వెంట గురజాల డీఎస్పీ పి.జగదీష్, కారంపూడి సీఐ టి.వి. శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో చైన్‌స్నాచింగ్

యడ్లపాడు: మహిళ మెడలోని బంగారు గొలుసుకును లాక్కొని పరారైన వ్యక్తిని గంటల వ్యవధిలోనే పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన పావులూరి మల్లేశ్వరి హైవే పక్కన కృష్ణగంగ నూలుమిల్లు వద్ద ఓ బడ్డీ కొట్టు నడుపుతోంది. సోమవారం మధ్యాహ్నం బైక్‌పై ఇద్దరు యువకులు వచ్చారు. ఒకరు బైక్‌పై ఉండగా, మరొకరు దిగి దుకాణం వద్దకు వచ్చి సిగరెట్, కూల్‌డ్రింక్ ఆర్డర్ చేశాడు. వాటిని ఇవ్వబోతున్న సమయంలోనే ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని పరుగున వెళ్లి బైక్ ఎక్కాడు. ఊహించని ఈ ఘటనకు షాక్ అయిన మల్లేశ్వరి కొద్దిసేపటికి తేరుకుని పెద్దగా కేకలు వేసింది. జనం పోగయ్యేలోగా గుర్తు తెలియని ఆ ఇద్దరు అక్కడి నుంచి ఉడాయించారు. బాధితురాలు యడ్లపాడు పోలీసులకు సమాచారం అందించగా అప్రమత్తమైన పోలీసులు సంఘటనా స్థలికి చేరుకున్నారు. రూ.2.65 లక్షల విలువైన నాలుగు సవర్ల గొలుసు చోరీ అయినట్లు బాధితురాలు పోలీసులకు తెలిపింది. పోలీసులు సాంకేతిక సాయంతో రెండు గంటల వ్యవధిలోనే నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నరసరావుపేట డీఎస్పీ పర్యవేక్షణలో చిలకలూరిపేట సీఐ బి.సుబ్బానాయుడు, యడ్లపాడు ఎస్ఐ వి బాలకృష్ణ, కానిస్టేబుల్స్ పోతురాజు, వినోద్, సాంబ ఆధ్వర్యంలో కేసు ఛేదించినట్లు తెలిసింది. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

మాజీ మంత్రి రజిని మామ కారుపై దాడి నేపథ్యంలో డ్రైవర్ ఫిర్యాదు

చిలకలూరిపేట: మాజీ మంత్రి విడదల రజిని మామ లక్ష్మీనారాయణ కారుపై టీడీపీ వర్గీయులు ఆదివారం దాడికి పాల్పడిన విషయం విదితమే. ఈ విషయమై కారు డ్రైవర్ ఉప్పుతోళ్ల రాజు చిలకలూరిపేట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని గుండయ్యతోటకు చెందిన ఉప్పుతోళ్ల రాజు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విడదల లక్ష్మీనారాయణ వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం లక్ష్మీనారాయణను ఆయన నివాసం వద్ద దింపి ఏటీఎంలో డబ్బులు డ్రా చేసేందుకు కారులో వెళుతున్నాడు. పురుషోత్తమపట్నంలోని వేణుగోపీనాథస్వామి ఆలయం వద్ద టీడీపీ వర్గీయులైన బైరా వెంకటప్పయ్య, బత్తినేని శ్రీనివాసరావు, తోట మనోహర్, తోటపల్లి శ్రీను, తోట సత్యనారాయణ మరికొందరితో కలసి కారును అడ్డగించి ఆపారు.

మారణాయుధాలతో కారు అద్దాలను ధ్వంసం చేశారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురించి లక్ష్మీనారాయణ, విడదల రజినికి మాట్లాడే అర్హత లేదంటూ అసభ్యపదజాలంతో దూషణలకు దిగారు. వాళ్లను చంపేస్తాం, బతకనిచ్చేది లేదంటూ దూషణలకు దిగారు. కారు అద్దాలు పగలగొట్టి, చొక్కా పట్టుకొని బయటకు లాగి దాడి చేసేందుకు యత్నిస్తున్న సమయంలో డ్రైవర్ తప్పించుకొని పోయాడు. ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై అర్బన్ సీఐ పి రమేష్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందిందని, విచారణ చేసి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

పంట పొలాల్లో చుక్కల జింక మృతి



మృతి చెందిన జింక

నరసరావుపేట రూరల్: మండలంలోని యలమంద గ్రామ పరిధిలోని వ్యవసాయ భూముల్లో చుక్కల జింక మృతదేహాన్ని సోమవారం రైతులు గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వేసవి ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో నీటి కోసం వచ్చి మృతి చెంది ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. గ్రామ పరిసరాల్లో సుబాబుల్ తోటలు అధికంగా ఉండటంతో అప్పడప్పుడు దారి తప్పి పొలాల్లోకి జింకలు వస్తుంటాయని, ఆ క్రమంలోనే వచ్చి ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు. ఆడ జింక కావటంతో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి గర్భిణో కాదో నిర్ధారించాల్సి ఉందని అటవీశాఖ అధికారులు చెప్పారు.